క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా గరుడ సేవ


గరుడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఉదయం గరుడసేవ విశేషంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలో గరుడ వాహనంపై వేంజేవచేసి అష్టోత్తర శతనామావళి పూజ చేసి హారతులు అందజేశారు. అనంతరం పూజలో పాల్గొన్న భక్తులు గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేశారు. వారికి స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాత రెడ్డి రంగారావుకు బాండ్ అందజేస్తున్న ఏఈవో శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి జీవీఎంసీ 98వ వార్డు పరిధి అడవివరంలోని సాయినగర్‌కి చెందిన రెడ్డి రంగారావు, నాగలక్ష్మీ ప్రసన్న దంపతులు లక్ష 116 రూపాయల విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్‌వో కార్యాలయంలో శనివారం అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు ఏఈవో పిల్లా శ్రీనివాసరావు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించి వేద ఆశీర్వచనం, ప్రసాదం అందజేశారు. పీఆర్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు, ఉద్యోగి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సఫాయి మిత్ర సురక్ష శిబిర్స్ ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పురుషోత్తపురంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో కార్పొరేటర్ ముమ్మన దేముడు మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికులు వారి ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ శానిటరీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


విజేతలతో పాఠశాల డైరెక్టర్ రంగారావు, కోచ్‌లు

పరవాడ : మండల పరిధి గొర్లివానిపాలెంలోని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. కింకో షోటో కాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన ఆర్.హర్షిత కరాటే, కుమిటీలో స్వర్ణ పతకాలు కైవశం చేసుకుంది. కె.మాన్సస్ కరాటేలో స్వర్ణం, కుమిటీలో కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. ఎ.చరణ్ కరాటేలో స్వర్ణ పతకం, ఎ.నవీన్ కరాటేలో కాంస్య పతకాలను సాధించారు. విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, వారిని తీర్చిదిద్దిన కోచ్‌లు ఎ.వి.రామారావు, లోహిత్‌ను పాఠశాల డైరెక్టర్ ఎస్.రంగారావు శనివారం అభినందించారు.

తాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం

పరవాడ: దేశపాత్రునిపాలెం గ్రామంలో తాగునీటి సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని 79 వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. వార్డులో ఏర్పాటు చేసిన చేతి పంపును శనివారం ఆయన ప్రారంభించారు. దీన్ని వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మచ్చా శివకుమార్, పిల్లా శివకృష్ణ పాల్గొన్నారు.


ముత్యాలమ్మపాలెం రోడ్డులో పెచ్చులూడుతున్న బ్రిడ్జి


ఊటగెడ్డ వంతెనపై కూలిన రెయిలింగ్

వణికిస్తున్న వంతెనలు

- మండలంలో పలుచోట్ల కూలే స్థితిలో బ్రిడ్జిలు
- శిథిలమైన రెయిలింగ్, రక్షణ గోడలు
- ప్రమాదాల బారిన ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

పరవాడ: గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం నిర్మించిన వంతెనలు శిథిల స్థితికి చేరి వణుకు పుట్టిస్తున్నాయి. వాటికి ప్రయాణికులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలోని పరవాడ-యలమంచిలి రహదారిలో కొన్నేళ్ల కిందట నిర్మించిన రెండు వంతెనలు పూర్తి స్థాయి మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నాయి. ఎన్టీపీసీ, జిందాల్, ఎస్ఈజెడ్ పరిశ్రమలకు రాకపోకలు సాగించే భారీ వాహనాలు, కార్మికులు, ఉద్యోగులు, గ్రామీణులు నిత్యం ఊటగెడ్డ వద్ద ఉన్న వంతెనల పైనుంచి ప్రయాణిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాలకు నడిచే ఆర్టీసీ బస్సులు, వేలల్లో నడిచే ద్విచక్ర వాహనాలు ఈ వంతెనలపై నుంచే వెళ్తుంటాయి. రాత్రి వేళ అదుపు తప్పిన భారీ వాహనాలు ఢీకొన్న ఘటనల్లో ఇక్కడ రెండు వంతెనల రక్షణ గోడలు కూలిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. ఫలితంగా పరిశ్రమల్లో ఉపాధి కోసం వెళ్లి రాత్రి వేళ వాహనాలపై వచ్చే కార్మికులు ప్రమాదాలకు గురై మృత్యువాత పడిన ఘటనలు గతంలో జరిగాయి.

భయం భయంగా ప్రయాణం

వంతెనలకు రెయిలింగ్‌లు దెబ్బతినడం వల్ల వాహనాలపై రాకపోకలు సాగించే ప్రయాణికులు భయపడుతున్నారు. నిత్యం ఈ బ్రిడ్జిలపై నుంచి బొగ్గు, బూడిద లారీలు అధిక సంఖ్యలో ప్రయాణించడం వల్ల రోడ్డు కూడా అధ్వాన స్థితికి చేరింది. ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గోతులతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. దేశపాత్రునిపాలెం వద్ద ఓ మలుపులో నిర్మించిన వంతెన చాలా కాలం నుంచి మరమ్మతుల కోసం ఎదురు చూస్తోంది. దీని రక్షణ గోడల్లో ఒకటి గతంలో భారీ వాహనం ఢీకొన్న ఘటనలో కూలిపోయింది. అప్పటి నుంచి రక్షణ గోడ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోలేదు. గాజువాక, విశాఖ, యలమంచిలి, పరవాడ, అచ్యుతాపురం సెజ్‌లకు రాకపోకలు సాగించే ఉద్యోగులు, కార్మికులు ఈ రహదారి మీదుగా ప్రయాణిస్తున్నారు. ఇక్కడ మలుపులో వంతెనకు రక్షణ గోడ లేని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

గ్రామస్తులు, ప్రయాణికుల విజ్ఞప్తులు

వాడచీపురుపల్లి-ముత్యాలమ్మపాలెం రహదారిలో ముత్యమాంబ ఆలయం సమీపంలోని వంతెన శిథిలావస్థకు చేరింది. ఏళ్ల కిందట నిర్మించిన ఈ వంతెనకు కనీస మరమ్మతులు నిర్వహించని కారణంగా రక్షణ గోడలు కూలిపోయాయి. వంతెన కింది భాగం పెచ్చులూడిపోయి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. వంతెన కూలిపోయే దుస్థితిలో ఉందని ముత్యాలమ్మపాలెం మత్స్యకారులు చెబుతున్నారు. తక్షణమే కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తిక్కవానిపాలెం వంతెనకు స్వల్ప మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఊటగెడ్డ-వాడచీపురుపల్లి రహదారిలో వంతెనకు రక్షణ గోడలు లేక ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. జాజులవానిపాలెం-పి.బోనంగి రహదారిలో వంతెన శిథిలావస్థలో ఉంది. కొత్త వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు ఏలేరు కాలువ వద్ద గట్టు కోతకు గురైంది. మరమ్మతులు చేపట్టాల్సి ఉందని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


ఊటగెడ్డ సమీపంలో శిథిలమైన మరో వంతెన


దేశపాత్రునిపాలెం రహదారి మలుపులో రక్షణ గోడ లేని వంతెన

భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నాం



వాడచీపురుపల్లి-ముత్యాలమ్మపాలెం రహదారిలో ముత్యమాంబ గుడి వద్ద నిర్మించిన వంతెన కూలడానికి సిద్ధంగా ఉంది. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేసినా.. కనీస చర్యలు తీసుకోలేదు. రక్షణ గోడలు కూలిపోయాయి. కొత్త వంతెన నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సూరాడ ముత్యాలరావు, ముత్యాలమ్మపాలెం

నిత్యం ప్రమాదాలు



దేశపాత్రునిపాలెం మలుపు వద్ద చాలా కాలం కిందట నిర్మించిన వంతెన కూలిపోయే స్థితికి చేరింది. ఈ వంతెనకు ఓ వైపు రక్షణ గోడ కూలిపోవడం వల్ల తరచూ ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అధికారులు స్పందించి పాత వంతెనను తొలగించి కొత్తది నిర్మించాలి.

– పప్పు కోటేశ్వరరావు, దేశపాత్రునిపాలెం

ఊటగెడ్డ వంతెనలు బాగుచేయాలి



పరవాడ-యలమంచిలి రహదారిలో అనేక ఏళ్ల కిందట నిర్మించిన రెండు వంతెనలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. రక్షణ గోడలు దెబ్బ తినడం వల్ల రాత్రి వేళ రాకపోకలు సాగించడానికి భయపడుతున్నాం. గతంలో రెండు మూడు ప్రమాదాలు జరిగాయి. రోడ్లు భవనాల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలి.

– పోతల శంకరరావు, పరవాడ

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం

పరవాడ-యలమంచిలి రహదారిలో రెండు వంతెనల మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ముత్యాలమ్మపాలెం, పి.బోనంగి రహదారుల్లో కొత్త వంతెనల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

– ఎం.లలిత, ఆర్‌అండ్‌బీ ఏఈ

నూకరాజు కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న అదీప్‌రాజ్ తదితరులు

పరవాడ : తానాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు డెక్క నూకరాజు కుటుంబాన్ని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నూకరాజు తల్లి డెక్క చిన్న(82) ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి అదీప్‌రాజ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూకరాజు కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పి.ఎస్.రాజు, వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, కొటాన రాము, కబడ్డీ అప్పారావు, వినోద్, సంతోష్, బొంది అచ్చిబాబు పాల్గొన్నారు.

గురజాడ రచనలకు విశేష ప్రజాదరణ


కళాశాలలో గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థినులు

పరవాడ: స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం మహాకవి గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా సంఘ అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అని కొనియాడారు. గురజాడ కన్యాశుల్కం నాటకానికి విశేష ప్రజాదరణ లభించిందని పేర్కొన్నారు. అధ్యాపకులు విజయలక్ష్మి, శ్యామల, విజయశ్రీ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు


స్వామివారి ఆలయంలో ఎమ్మెల్యే గణబాబు, సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ తదితరులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకట రమణ తదితరులు స్వామిని దర్శించుకున్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో వారి పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో సుజాత, ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

సింహాచలం: పంచగ్రామాల భూసమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. 93వ వార్డు ప్రహ్లాదపురంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచగ్రామాల సమస్య పరిష్కారానికి ఇటీవల అసెంబ్లీ జరిగినప్పుడు రెవెన్యూ, ఎండోమెంట్, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించామన్నారు. సమస్య కోర్టులో ఉండటంతో సీఎం చంద్రబాబు పరిష్కరించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని చెప్పారు. దేవస్థానానికి ప్రత్యామ్నాయ భూములు ఇచ్చేందుకు పరిశీలిస్తున్నామన్నారు. ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను ఇంటింటికి అంటించారు. 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా తదితరులు పాల్గొన్నారు.

- 98వ వార్డు అడవివరం గాంధీనగర్‌లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

95వ వార్డులో పర్యటన

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డులో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పర్యటించారు. 100 రోజులుగా కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కూటమి నాయకులు ఇంటింటికీ ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అంటించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

- 97వ వార్డు చినముషిడివాడలో కార్పొరేటర్ శానాపతి వసంత శంకరరావు ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు ఇంటింటా అంటించారు.

ముగిసిన ఆటల పోటీలు


పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

పరవాడ: నాలుగు రోజులపాటు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ పరవాడ మండల స్థాయి క్రీడా, ఆటల పోటీలు ముగిశాయి. శనివారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు పరవాడ ఇండోర్ స్టేడియమ్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని 8 ఉన్నత పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ తులసీ సత్యవతి ప్రారంభించారు. కార్యకమంలో పాల్గొన్న ఎస్‌జీఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ వరుసగా నాలుగు రోజుల పాటు మండల ఫిజికల్ డైరెక్టర్లు పోటీలను దిగ్విజయంగా పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయి పోటీల్లో తలపడనున్న క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల ఫిజికల్ డైరెక్టర్లు తులసీ సత్యవతి, బి.అన్నాజీరావు, పి.లక్ష్మి, శ్రీదేవి, రౌతు దేవి, గౌరీదేవి, రవి తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు సేవలు ఎనలేనివి

జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా క్రీడా విభాగంలో జిల్లాను ప్రథమం స్థానంలో నిలపడంలో నాగేశ్వరరావు పాత్ర ఎనలేనిదని సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు తులసీ సత్యవతి, బి.అన్నాజీరావు అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులకు వారధిగా పనిచేస్తూ ఎస్‌జీఎఫ్ క్రీడలను సజావుగా నిర్వహించడంలో ఆయన సేవలు మరువలేనివన్నారు.


శాకాహారమే ముద్దు


చిన అప్పలనాయుడిని సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

పెందుర్తి: మాంసాహారం కంటే శాకాహారమే ఆరోగ్యానికి మంచిదని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు అన్నారు. పెందుర్తిలోని ఓం శాంతి బ్రహ్మకుమారీస్ మందిరంలో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శరగడం మాట్లాడుతూ సమాజానికి ఓం శాంతి ప్రతినిధులు ఆదర్శనీయులన్నారు. జంతుబలి నిషేధానికి వారు చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. పేదలకు నిస్వార్థ సేవలందించేందుకు వారెప్పుడు సిద్ధంగా ఉంటారన్నారు. అనంతరం చిన అప్పలనాయుడిని బ్రహ్మకుమారీలు సత్కరించారు. ఓంశాంతి సంస్థ మౌంట్ అబు ప్రతినిధి వేణుగోపాల్, జిల్లా ప్రతినిధి సీత, పెందుర్తి ప్రతినిధి భవాని తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


ఆలయంలో తులాభారం సమర్పిస్తున్న భక్తులు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి : స్థానిక వెంకటాద్రిపై కొలువైన శ్రీ వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన అనంతరం బాలభోగం సమర్పించారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం తర్వాత సర్వ దర్శనాలు కల్పించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు.

క్రీడా ఎంపిక పోటీలు ప్రారంభం


ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం మల్లేశ్వరరావు, మళ్ల యోగి

సబ్బవరం: మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్-14, అండర్-17 బాలుర క్రీడా ఎంపిక పోటీలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వీటిని హెచ్‌ఎం ఎం.ఎస్.మల్లేశ్వరరావు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ మల్ల యోగితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ మండలంలోని 9 పాఠశాలల నుంచి 225 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. విజేతలు నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా అంశాల్లో పోటీలు జరుగుతాయని, ఈ నెల 23న బాలికల పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పీడీ అబ్దుల్ రెహమాన్, చందన వర్మ, గ్రామ పెద్దలు ఆడారి నాగరాజు, మల్ల వెంకటరావు, దొడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఏలేరు కాలువ గట్టు


భారీ వర్షాలకు కోతకు గురైన ఏలేరు కాలువ గట్టు

పరవాడ : గతంలో కురిసిన భారీ వర్షాలకు లంకెలపాలెం వంతెన వద్ద ఏలేరు కాలువ గట్టు కోతకు గురై ఏడాదిన్నర కావస్తున్నా అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదు. ఇటీవల కాలంలో ఎప్పటికప్పుడు కురుస్తున్న భారీ వర్షాలకు గట్టు మరింతగా కోతకు గురై మట్టి కాలువలోకి కొట్టుకుపోయింది. గతంలో గట్టు కోతకు గురైనప్పుడు మరమ్మతులు చేపట్టారు. కానీ అవి ఎంతో కాలం నిలవలేదు. ఆ తర్వాత కురిసిన వర్షాలు గట్టును మరింత కోతకు గురిచేశాయి. రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి గట్టుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వాడవాడలా అన్నసమారాధనలు


గణపతిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, త్రినాథ్, నాయకులు


శిడగం వీధిలో అన్నప్రసాదం అందజేస్తున్న కర్రి అప్పలస్వామి, తదితరులు


ఆయిల్‌మిల్ వద్ద అన్నప్రసాదం అందజేస్తున్న గంట్ల శ్రీనుబాబు తదితరులు

పెందుర్తి : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పెందుర్తి సమీప పెదగాడిలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత కేసుబోయిన త్రినాథ్, సర్పంచ్ కేసుబోయిన లావణ్య ఆధ్వర్యంలో మొత్తం 35 రకాల పిండి వంటలు, కూరలతో భోజనం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నసమారాధనను ప్రారంభించారు. సుమారు 6 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. ముందుగా గణపతి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సింహాచలం : వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా శనివారం 98వ వార్డు పరిధి అడవివరంలో అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక ఆయిల్ మిల్ వద్ద గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో 2 వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. గణేష్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. వరసగా 40 ఏళ్ల నుంచి వినాయక చవితి మహోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ యువజన సేవా సంఘానికి రూ.50 వేలు, శిడగంవీధిలోని శ్రీనివాస యూత్ ఫ్రెండ్స్‌కి రూ.20 వేలు, పలు అసోసియేషన్లకు రూ.35 వేల విరాళాన్ని గంట్ల శ్రీనుబాబు అందజేశారు.

- శిడగం వీధిలో శ్రీనివాస యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 5 వేల మందికి 33 రకాల వంటకాలతో అన్నసమారాధన నిర్వహించారు. అడవివరం కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి భక్తులకు వడ్డన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, అడవివరం కో ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, సొసైటీ డైరెక్టర్ ఆకుల నాగరాజు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ


మానవహారంలో పాల్గొన్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

పెందుర్తి : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ఆవరణలో భారీ మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. కళాశాల సిబ్బంది మూర్తి, నాగమణి, శేషసాయి తదితరులు పాల్గొన్నారు.